

సీఎం రేవంత్ పర్యటన సందర్భంగా మామిడ్గి గ్రామానికి నిమ్జ్ భూబాధితులను అరెస్ట్ చేయడానికి వచ్చిన పోలీసులను అడ్డుకుంటున్న మహిళలు

## ముందస్తు అరెస్టులే ప్రజాపాలనా?

- సీఎం పర్యటన సందర్భంగా ప్రతిసారీ ఇదే తీరు
- మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు



హైదరాబాద్ మే 23 (నమస్తేతెలంగాణ): సీఎం పర్యటిస్తున్న ప్రతిసారి ముందస్తు అరెస్టులు, అక్రమ నిర్బంధాలెందుకు? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్‌లో చెంచులు, జహీరాబాద్‌లో రైతులు, నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడమే రేవంత్ మార్క్ ప్రజాపాలనా? అంటూ నిలదీశారు. జహీరాబాద్ నిమ్స్ చుట్టూ ఉన్న గ్రామాలను అష్టదిగ్బంధం చేసి రైతులను అరెస్ట్ చేయడాన్ని శుక్రవారం ఎక్స్ వేదికగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో పౌరుల భావప్రకటనా స్వేచ్ఛ, ఆవేదనను వ్యక్తం చేసే హక్కును హరించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. నిర్బంధాలు, కంచెలు, ఆంక్షలు లేనిది ముఖ్యమంత్రి పర్యటన సాగేట్టులేదని ఎద్దేవా చేశారు. రైతులు, నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మోదీని ఎన్నిసార్లయినా కలుస్తా

- జహీరాబాద్ సభలో సీఎం రేవంత్
- పైసా ప్రకటించకపోవడంపై ఎమ్మెల్యేల్లో అసంతృప్తి
- మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అలిగిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- జగ్గారెడ్డికి బాధ్యతలపై మాజీ మంత్రి చంద్రశేఖర్ గుర్రు



జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభలో ఖాళీ కుర్చీలు

సంగారెడ్డి మే 23 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీని ఒక్కసారి కాదు యాభై సార్లు అయినా కలుస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.400 కోట్లకుపైగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన బహిరంగసభలో సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని చెప్పారు. నిమ్జ్ భూసేకరణ, పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేస్తామని వెల్లడించారు. నిమ్జ్‌లో 450 ఎకరాల్లో త్వరలోనే హ్యుందయ్ కం పెనీ ఏర్పాటవుతుందని తెలిపారు. నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఇది మినహా జిల్లాకు మరే నిర్దిష్ట హామీ ఇవ్వలేదు. అంతకుముందు ప్రసంగించిన జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్ పలు విజ్ఞప్తులు చేసినప్పటికీ, ఆయా పనులకు సీఎం నిధులు ప్రకటించకపోవడంతో వారు అసంతృప్తికి లోనైనట్టు తెలుస్తున్నది.

### అలకబూనిన సంజీవరెడ్డి, చంద్రశేఖర్

సీఎం సభకు హాజరైన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అలకబూనారు. సభలో ప్రసంగించేందుకు తనకు అవకాశం ఇవ్వాలని సభాధ్యక్షుడు, ఎంపీ సురేశ్ షెట్కార్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డిని కోరినప్పటికీ తిరస్కరణ ఎదురైంది. దీంతో ఆయన చేసేదేమీ లేక తన నియోజకవర్గానికి నిధులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాలను సీఎంకు అందజేసి సభ నుంచి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. ఇది గమనించిన మరో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆయనను వారించారు. ఇదిలా ఉంటే నిమ్జ్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను అందజేసే బాధ్యతను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి అప్పగిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తనను కాదని జగ్గారెడ్డికి ఈ బాధ్యత అప్పగించడంపై మాజీ మంత్రి చంద్రశేఖర్ అలకబూనినట్టు తెలుస్తున్నది.

### జనం లేక సీఎం సభ వెలవెల

జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభ జనం లేక వెలవెలబోయింది. బహిరంగ సభకు 30వేల మందిని సమీకరించాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకోగా, సుమారు 10 వేల మంది మాత్రమే హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సీఎం ప్రసంగిస్తుండగానే బహిరంగసభ నుంచి ప్రజలు ఇండ్లకు తిరుగుముఖం పట్టడం కనిపించింది.

## సీఎం పర్యటనతో ముందస్తు అరెస్టులు

సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పర్యటన సందర్భంగా పోలీసులు శుక్రవారం వేకువజాము నుంచే రైతులు, బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులను ఇండ్ల నుంచి కదలకుండా నిర్బంధించారు. నిమ్జ్‌లో భూములు కోల్పోయిన రైతులు సీఎం రేవంత్ పర్యటన సందర్భంగా ఆందోళనలకు దిగుతారన్న భయంతో న్యాల్‌కల్ మండలం మామిడ్గి, ఝరాసంగం మండలం లోని ఎల్గోయికి చెందిన రైతులతో పాటు న్యాల్‌కల్ మండలం మల్గి, డప్పూరు, న్యామతాబాద్, ఝరాసంగం, జహీరాబాద్‌కు చెందిన యాభై మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి చిరాగ్‌పల్లి, హద్నూర పోలీసుస్టేషన్లకు తరలించారు. మరికొంత మంది ముఖ్య నాయకులను గృహనిర్బంధంలో ఉంచారు. సీఎం పర్యటన ముగిసిన అనంతరం వారిని వదిలిపెట్టారు. ఈ అరెస్టులను నిరసిస్తూ మామిడ్గిలో మహిళలు, గ్రామస్థులు ఆందోళనకు దిగగా, వారిని కూడా అరెస్టుచేసి హద్నూర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## దామోదర, కడియం నికార్సైన మాదిగలు కారు

- మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్



హైదరాబాద్, మే 23 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ నేతలు దామోదర రాజనర్సింహ, కడియం శ్రీహరి నికార్సైన మాదిగలు కారని, వారు మాదిగ ఉపకులానికి చెందినవారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణలో ఎస్సీ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. సీఎల్పీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనతోపాటు కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూరు), వేముల వీరేశం (నకిరేకల్), తోట లక్ష్మీకాంతారావు (జుక్కల్), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్(ధర్మపురి), కాలే యాదయ్య (చేవెళ్ల) లలో ఎవరికి ఇచ్చినా పర్వాలేదని ఆయన స్పష్టంచేశారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి మంత్రి పదవిపై కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాశామన్నారు. మాల సామాజిక వర్గానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టంచేశారు.

## నివేదికలన్నీ వచ్చాకే చర్యలు

కమిషన్‌ను తప్పుపట్టడం సరికాదు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన విచారణ నివేదికలన్నీ వచ్చాక వాటన్నింటినీ అధ్యయనం చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సచివాలయంలో శుక్రవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇప్పటికే విజిలెన్స్ నివేదిక, ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టులు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో భాగమైన మూడు బరాజ్‌లపై జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ విచారణ కొనసాగిస్తున్నదని వెల్లడించారు. ఆ కమిషన్ నివేదిక కూడా వచ్చిన తరువాత అన్ని నివేదికలను అధ్యయనం చేసి, ఆపై బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కమిషన్ స్వతంత్రంగా విచారణ జరుపుతున్నదని పేర్కొన్నారు. కొందరు నాయకులు కమిషన్‌ను తప్పుబట్టడం, రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఎలాంటి తప్పు చేయనప్పుడు కమిషన్ ఎదుట హాజరుకావాలని కోరారు.

## కేటీఆర్ వ్యాఖ్యలపై సీబీఐ విచారణ చేపట్టాలి

సీఎం రేవంత్‌ను కోరిన మంత్రి పొన్నం



హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో బాంబులు పెట్టారంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను పిటిషన్‌గా తీసుకొని సీబీఐతో విచారణ చేయించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతున్నట్టు తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిందని, వారు అధికారంలో ఉన్నప్పుడే అది కూలిందని, అయితే ఆ చెడ్డ పేరును కాంగ్రెస్ పార్టీ మీదకు నెట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టులు నిర్మిస్తుందని, ప్రాజెక్ట్‌లు కూలగొట్టే చరిత్ర లేదని అన్నారు. కేటీఆర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## మంత్రులు ఉత్తమ్, నాదెండ్ల భేటీ

హైదరాబాద్, మే 23(నమస్తే తెలంగాణ): రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పర సహకారంతో పని చేస్తాయని రెండు రాష్ట్రాల సివిల్ సప్లయ్ మంత్రులు నాదెండ్ల మనోహర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లయ్ భవన్‌లో ఇద్దరూ భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. విభజన ప్రకారం ఏపీకి కేటాయించిన సివిల్ సప్లయ్ భవన్‌లోని కొంత భాగాన్ని తెలంగాణ సివిల్ సప్లయ్‌కి అద్దెకు ఇచ్చేందుకు ఏపీ అంగీకరించింది. ఇద్దరు మంత్రుల సమక్షంలో ఒప్పందం జరిగింది. ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. తమ భవనాన్ని తెలంగాణకు ఇచ్చేందుకు అంగీకరించినట్టు తెలిపారు. ఇదే విధంగా మరిన్ని అంశాల్లోనూ కలిసి పని చేస్తామని పేర్కొన్నారు. కాకినాడ ఓడరేవు నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేస్తున్న తెలంగాణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## అధికారిక వేదికపై కాంగ్రెస్ నేతలు

గంభీరావుపేట, మే 23: కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారిక కార్యక్రమాలు పార్టీ కార్యక్రమాలుగా మారుతున్నాయి. రాష్ట్ర ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా.. ప్రొటోకాల్ విస్మరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన కార్యక్రమమే అందుకు అద్దం పడుతున్నది. శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో ప్రొసీడింగ్‌ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేదికపై ఎలాంటి ప్రొటోకాల్ లేని కాంగ్రెస్ నేతలను కూర్చోబెట్టారు. తహసీల్దార్ మారుతీరెడ్డి, ఎంపీడీవో రాజేందర్‌తోపాటు మండల స్థాయి అధికారులు చోటు లేక వారి వెనుక నిల్చుండి పోయారు. ఫ్లెక్సీలోనూ స్థానిక ఎమ్మెల్యే ఫొటో పెట్టకపోవడంపై బీఆర్‌ఎస్ నాయకులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

## ఉగ్రకుట్రపై విచారణ షురూ

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): ఉగ్రదాడులకు పాల్పడేందుకు కుట్ర పన్నారన్న కేసులో నిందితులు సిరాజ్, సమీర్‌ను 5 రోజులపాటు విచారించేందుకు ఏపీలోని విజయనగరం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారిని విశాఖ జైలు నుంచి విజయనగరంలోని పోలీస్ శిక్షణ కళాశాలకు తీసుకెళ్లినట్టు సమాచారం. ఈ కేసు విచారణలో పోలీసులు, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులతోపాటు యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) కూడా చేరినట్టు తెలిసింది. నిందితులకు నిధులు ఎలా అందాయి? పేలుడు పదార్థాల తయారీ కోసం వారితోపాటు శిక్షణ పొందినవారు ఏయే రాష్ట్రాల్లో ఉన్నారు? అనే కోణంలో ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుండగా.. నిందితులు ఎలాంటి దాడులకు పాల్పడేందుకు సిద్ధమయ్యారనే విషయంపై ఏటీఎస్ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

# జాతీయ రహదారులపై ఉచిత సేవలు

**అవగాహనలేక వాహనదారుల ఇబ్బందులు • టోల్ ఫ్రీ నంబర్ 1033కి కాల్ చేస్తే పరిష్కారం**

హైదరాబాద్, మే 23 (నమస్తేతెలంగాణ) : జాతీయ రహదారిపై దూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్న సమయంలో ..మనం ప్రయాణిస్తున్న వాహనానికి ఏదైనా ప్రమాదం జరిగినా, పెట్రోల్, డీజిల్ అయిపోయినా, అకస్మాత్తుగా హైవేపై వాహనం నిలిచిపోయినా, టైర్ పంక్చర్ అయినా వెంటనే చాలా మంది ప్రయాణికులు ఆందోళనకు గురవుతారు. ఏంటీ ఎవరీలేని ప్రాంతంలో ఇలా జరిగిందని. అప్పుడు ఎవరికీ దీని గురించి చెప్పాలి? పోలీసులకు ఫోన్ చేస్తే ఈ ప్రాంతానికి చేరుకోవడానికి సమయం పడుతుందే అని ఆలోచిస్తూ ఉంటారు. కానీ ఆందోళన చెందకుండా ఈ 1033 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణమే సాయం అందించడానికి మీ దగ్గరకు వస్తారు. అప్పుడు మనం ప్రయాణాన్ని సాఫీగా సాగించవచ్చు.



### టోల్ ఫ్రీ నంబరు 1033కి కాల్ చేస్తే..

- రోడ్డు ప్రమాదం జరిగితే ఘటనాస్థలానికి అంబులెన్స్ పంపించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తారు.
- మార్గమధ్యలో వాహనంలో ఇంధనం అయిపోతే పెట్రోలింగ్ వాహన సిబ్బంది పంపించి.. ఐదు లీటర్ల పెట్రోల్ లేదా డీజిల్‌ను తెచ్చి ఇస్తారు. అయితే ఇక్కడ ఇంధన ధరను వాహనదారుడే చెల్లించాల్సి ఉంటుందనే విషయం మరిచిపోకూడదు.
- వాహనం టైరు పంక్చర్ అయితే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి టైరు బిగించడానికి సాయం చేస్తారు.

### సేవలు పూర్తిగా ఉచితం ..

టోల్‌ఫ్రీ నంబరు 1033కి కాల్ చేస్తే దేశంలోని ఏ జాతీయ రహదారిపై ప్రయాణించిన ఈ సేవలన్నీ ఉచితంగానే అందుతాయి. వాహనదారుడు ఫోన్ చేసిన 20-25 నిమిషాల్లోపే ఘటనా స్థలానికి పెట్రోలింగ్, రెస్క్యూ సిబ్బంది చేరుకుంటారు. ఈ టోల్ ఫ్రీ నంబరును ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఏఐ నుంచి పర్యవేక్షిస్తోంది. నేషనల్ హైవేపై ఏదైనా జరిగితే ఫోన్ కాల్ వచ్చిన వెంటనే హైవే నంబరు, లొకేషన్ వారు అడుగుతారు. వారికి కాల్ చేయగానే ముందుగా పెట్రోలింగ్ సిబ్బందికి కాల్ చేసి సమాచారం అందిస్తారు. అక్కడ వారు స్పందించకపోతే ప్రాజెక్టు మేనేజర్‌కి, అతడు కూడా స్పందించకపోతే ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫోన్ చేస్తూనే ఉంటారు.

### సమస్య తీరిన తర్వాత కాల్ చేసి సమాచారం సేకరణ :

ఇలా పెట్రోలింగ్ సిబ్బంది లేదా అక్కడికి వెళ్లిన ప్రాజెక్టు అధికారులు సమస్య పరిష్కారం అయిన తర్వాత కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తెలుపుతారు. మళ్లీ 1033 నంబర్ నుంచి వాహనదారుడికి ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయిందా లేదా ఎవరైనా డబ్బులు అడిగారా? మీరు ఇచ్చారా అని ఆరీ తీస్తారు.ఈ ఉచిత సేవలపై వాహనదారులకు అవగాహన కలిగేలా ప్రతి జాతీయ రహదారిపై ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక బోర్డును ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాటు చేసింది. తెలుగు, ఇంగ్లిష్‌లో ఏర్పాటు చేసిన 1033 బోర్డులు డివైడర్ మధ్యలో రోడ్డు పక్కనే ఉంటాయి. దీనిపై వాహనదారుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి కూడా ఇది దోహదం చేస్తుంది.

## గగన్‌యాన్ కోసం 7,200 పరీక్షలు పూర్తి

**ఇక మిగిలింది 3వేల పరీక్షలే : ఇస్రో చీఫ్ నారాయణన్**

కోల్‌కతా: గగన్‌యాన్ ప్రోగ్రామ్‌లో అత్యధిక పరీక్షలు పూర్తయ్యాయని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ వీ నారాయణన్ గురువారం తెలిపారు. కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2025వ సంవత్సరం ఇస్రోకు చాలా ముఖ్యమైనదని చెప్పారు. దీనిని గగన్‌యాన్ సంవత్సరంగా ప్రకటించామని గుర్తు చేశారు. గగన్‌యాన్‌లో మానవుడిని దిగువ భూకక్ష్యలోకి పంపించడానికి ముందు మానవులు లేకుండా మూడు మిషన్స్‌ను పంపించాలని నిర్ణయించామన్నారు. వీటిలో మొదటిదైన వ్యోమమిత్రను ఈ ఏడాది డిసెంబరునాటికి ప్రయోగిస్తామని చెప్పారు. గగన్‌యాన్ కోసం 7,200కుపైగా పరీక్షలు పూర్తయ్యాయని, మిగిలిన సుమారు 3,000 పరీక్షలను నిర్వహించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. 2027లోని మొదటి మూడు నెలల్లోనే మానవ సహిత గగన్‌యాన్‌ను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్పేడెక్స్ మిషన్ పూర్తయినందుకు హర్షం వ్యక్తం చేశారు. దీని కోసం 10 కిలోల ఇంధనం ఖర్చవుతుందని లెక్క వేశామని, అయితే, అందులో సగం ఇంధనంతోనే ఈ మిషన్‌ను పూర్తి చేశామని, మిగిలిన ఇంధనం అందుబాటులో ఉందని తెలిపారు.

# ఆర్టీఐ కమిషన్‌లో బీసీలకు చోటేది?

- కాంగ్రెస్ చెప్పేదొకటి.. చేసేదొకటి
- అన్నింట్లో అగ్రవర్ణాలకే ప్రాధాన్యం
- బలహీనవర్గాలకు దక్కని అవకాశం
- సామాజిక, రాజకీయ వర్గాల్లో విమర్శలు




హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): సమాచార కమిషనర్ల నియామకంలో కాంగ్రెస్ సర్కారు సామాజిక న్యాయం పాటించలేదని, బీసీలకు అన్యాయం చేసిందని సామాజిక, రాజకీయవర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్, ఐదుగురు కమిషనర్ల నియామకాలను ప్రభుత్వం పూర్తిచేసింది. మరో రెండు కమిషనర్ పోస్టులను పెండింగ్‌లో పెట్టింది. ఇప్పటికే పూర్తయిన ఐదుగురు కమిషనర్ల నియామకాల్లో బీసీల నుంచి ప్రాతినిధ్యం లేదు. ఇక పెండింగ్‌లో ఉన్న రెండు నియామకాల్లోనూ బీసీలకు అవకాశం కల్పించడంపై సామాజిక కార్యకర్తలు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

### బీసీలకు మొండిచేయి

రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్, ఏడుగురు కమిషనర్ల నియామకానికి ప్రభుత్వం రెండు నెలల క్రితం కసరత్తు చేపట్టింది. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పోస్ట్‌కు సీఎంవో కార్యదర్శిగా పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి పేరును, కమిషనర్ పదవులకు పీవీ శ్రీనివాస్ రావు(బ్రాహ్మణ), బోరెడ్డి అయోధ్యరెడ్డి(రెడ్డి), కప్పర హరిప్రసాద్(బీసీ), పీఎల్ఎన్ ప్రసాద్(బీసీ), రాములు(ఎస్సీ), వైష్ణవి మేర్ల(కమ్మ), పర్వీన్ మొహిసిన్ (ముస్లిం మైనార్టీ) పేర్లను ఏప్రిల్ 26న గవర్నర్ ఆమోదానికి పంపింది. వీరిలో కప్పర ప్రసాద్, పీఎల్ఎన్ ప్రసాద్, రాములు మినహా మిగిలిన నలుగురి ప్రతిపాదనలకు గవర్నర్ పచ్చజెండా ఊపారు. కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా పని చేస్తున్నందు వల్లే ఈ ముగ్గురి పేర్లు ఆమోదం పొందలేదని, సమాచారం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాములు(ఎస్సీ) స్థానంలో దేశాయ్ భూపాల్ (ఎస్సీ) పేరును గవర్నర్‌కు పంపించగా ఆమోదం లభించింది. కానీ ఆమోదం పొందని బీసీ అభ్యర్థులు కప్పర హరిప్రసాద్, పీఎల్ఎన్ ప్రసాద్ స్థానంలో మాత్రం ప్రత్యామ్నాయ పేర్లను ప్రతిపాదించలేదని తెలుస్తున్నది. అందుకే ఆ రెండు పోస్టులు ఖాళీగా ఉంచి, మిగిలిన ఐదు పోస్టులకు మాత్రమే ప్రభుత్వం నియామకం, ప్రమాణ స్వీకార ప్రక్రియను పూర్తి చేసిందని సమాచారం.

### గోప్యత ఎందుకు?

ప్రభుత్వం ఆర్టీఐ కమిషనర్ల నియామకప్రక్రియకు సంబంధించి జీవో జారీ చేసింది. ఈ జీవోలో చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్, కమిషనర్ల పేర్లు, వారి సామాజికవర్గాల వివరాలను పేర్కొంది. కానీ వైష్ణవి మేర్ల పేరు పక్కన మాత్రం తన సామాజికవర్గమైన కమ్మ అని పేర్కొనలేదు. అందరి సామాజికవర్గాలను ప్రస్తావించి, వైష్ణవి వర్గంలో మాత్రం గోప్యత ఎందుకు పాటించినట్టు అనే సందేహాలు సామాజిక, రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఇందులో ఆంతర్యమేంటని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వ్యవస్థాపకుడు రాజేంద్ర పల్నాటి ప్రశ్నించారు. ప్రభుత్వం గవర్నర్‌ను తప్పుదోవ పట్టించి అర్హతలేని వారికి పదవులు కట్టబెట్టిందని విమర్శించారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

### బీసీ సంఘాల అసహనం

రేవంత్ సర్కారు వైఖరిపై బీసీ సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీఐ కమిషనర్ల నియామకాల్లో అన్యాయం జరిగిందంటూ పలువురు మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ చెప్పే సామాజికన్యాయం ప్రకారం ఏడుగురు కమిషనర్ల పోస్టుల్లో మూడు పోస్టులు బీసీలకు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేస్తున్నారు. ఆర్టీఐ కమిషనర్లుగా రాజకీయ నేపథ్యమున్న వారి అభ్యర్థిత్వం ఆమోదం పొందదని తెలిసీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బీసీ, ఎస్సీ అభ్యర్థులుగా కాంగ్రెస్ నాయకుల పేర్లు పంపించిందని వారు ఆరోపిస్తున్నారు. బీసీలకు మొండిచేయి చూపడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అసలు నైజం బయటపెట్టుకున్నారని విమర్శిస్తున్నారు. పదవుల్లో అన్యాయం చేస్తే కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరిస్తున్నారు.

## జపాన్‌లో బియ్యం సంక్షోభం



- అడుగంటిన నిల్వలు.. రెట్టింపైన ధరలు
- వ్యవసాయ శాఖ మంత్రి రాజీనామా

టోక్యో: జపాన్‌లో బియ్యం సంక్షోభం నెలకొంది. దేశంలో నిల్వలు అడుగంటాయి. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేదు. జపనీయుల సంస్కృతి, సంప్రదాయం, రాజకీయాలలో బియ్యంది కీలకమైన పాత్ర. దశాబ్దాలుగా బియ్యం వినియోగం తగ్గినప్పటికీ ఓవల్ ఆకారంలో ఉండే జిగట జపానికా ధాన్యాన్ని ఆహారంగా భుజించడం ప్రజలు గర్వంగా భావిస్తారు. బియ్యం ధరలు సాపేక్షంగా ఎక్కువ ఉండటానికి బియ్యానికి బదులు ప్రత్యామ్నాయ పంటలు పండించాలని ప్రభుత్వం ప్రోత్సహించింది. తద్వారా వరి విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ఉత్పత్తి తగ్గడంతో వీటి ధరలు గత వేసవి నుంచి పెరగడం ప్రారంభమయ్యాయి. అయితే ఈ కొరతను నివారించడానికి ప్రభుత్వం ఈ ఏడాది అత్యవసర బియ్యం నిల్వలను విడుదల చేసింది. అయితే ఈ నిల్వలు సూపర్‌మార్కెట్లకు మందకొడిగా చేరుకుంటుండటంతో బియ్యం నిల్వలు ఏవి అంటూ ప్రజలు నిలదీయడం ప్రారంభించారు. ప్రజల ఒత్తిడి తట్టుకోలేక జపాన్ వ్యవసాయ శాఖ మంత్రి టక్ ఇటో బుధవారం రాజీనామా చేశారు. కాగా, బియ్యం సమస్యపై దర్యాప్తు జరిపి దానిని పరిష్కరించాలని కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రి షింజిరో కొయిజుమి ఆదేశించారు. గత వేసవిలో పోలిస్తే బియ్యం ధర రెట్టింపైందని, ఆ ధరకు కొందామన్నా కూడా సూపర్ మార్కెట్లలో లభ్యం కావడం లేదని పౌరులు ఆరోపిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే 4 లక్షల టన్నుల కొరత ఉందని జపాన్ వ్యవసాయ సహకార సంఘాలు, వాణిజ్య హోల్‌సేల్ వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం అత్యంత కనిష్ఠానికి దిగజారి దేశంలో 15.3 లక్షల టన్నుల నిల్వలు మాత్రమే ఉన్నాయని వారు చెప్పారు.

# మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

తొలినుంచీ కాంగ్రెస్‌కు విధేయులుగా ఉంటున్నట్టు పేర్కొన్నారు. తామే ఒరిజినల్ పార్టీ మాదిగ ఎమ్మెల్యేలమని పేర్కొన్నారు. చేవెళ్ల డిక్లరేషన్, ఎస్సీ వర్గీకరణ హామీలను అమలుచేయాలని కోరారు. ఇప్పటికే మార్చి 25న ఈ ఎమ్మెల్యేలే మంత్రి పదవి కోసం లేఖ రాశారు. ఇప్పుడు అదే అంశంపై మరోసారి లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

### అన్ని పదవులూ మాలలకేనా? మాకేం లేవా?

ప్రస్తుత ప్రభుత్వంలో పదవులన్నీ మాల వర్గానికి చెందిన నేతలకు ఇస్తున్నారని మాదిగ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ ఎంపీ సీట్లలో రెండు మాల వర్గానికి ఇవ్వగా, ఒకటి మాత్రమే మాదిగలకు ఇచ్చారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటును కూడా మాల వర్గానికి చెందిన నేతకే (అద్దంకి దయాకర్) ఇచ్చారని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం, స్పీకర్ పదవి కూడా మాల సామాజిక వర్గానికి చెందిన నేతలకు ఇచ్చారని వివరించారు. ఇక మాదిగల్లో 1% ఉండే ఉప కులానికి ఒకే ఒక్క మంత్రి పదవి ఇచ్చారని, 9% జనాభా కలిగిన మాదిగలకు మాత్రం మంత్రి పదవి ఇవ్వకుండా అన్యాయం చేశారని పేర్కొన్నారు.

### మంత్రి పదవి కోసం లేఖల యుద్ధం

రాష్ట్ర క్యాబినెట్‌లో ఆరు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉన్నది. గత నెలలో మంత్రివర్గ విస్తరణ ఖాయమనే సంకేతాలు వెలువడ్డాయి. అప్పట్లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఏం జరిగిందో ఏమో కానీ ఆ కసరత్తు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో మంత్రి పదవిని ఆశిస్తున్న వారు లేఖల యుద్ధానికి తెరతీశారు. మాల సామాజిక వర్గానికి చెందిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మాదిగ ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి లేఖ రాయడం సంచలనం సృష్టించింది. మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. ఆ తర్వాత లంబాడ, ఆదివాసీ ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి లేఖ రాశారు. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు సైతం తమ జిల్లాకు ప్రాతినిధ్యం ఇవ్వాలంటూ మరో లేఖ రాశారు. ఈ లేఖపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా సంతకం పెట్టడం గమనార్హం. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి కూడా రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఇవ్వాలంటూ లేఖ రాయడం అప్పట్లో సంచలనంగా మారింది. నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చెక్ పెట్టేందుకే జానారెడ్డి ఈ చర్చ లేవదీశారనే ప్రచారం జరిగింది. దీంతో జానారెడ్డి శకుని మాదిరిలా తయారయ్యారంటూ రాజగోపాల్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో మంత్రి విస్తరణ ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ మాదిగ ఎమ్మెల్యేలు మరో లేఖాస్త్రం సంధించడం చర్చనీయాంశంగా మారింది.